సాక్షి నల్లగొండ

గురువారం । 20 । ఫిబ్రవరి । 2025



పెద్దగట్టును అభివృద్ధి చేస్తాం

పెద్దగట్టు లింగమంతులస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.

- 8లో



అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని ఐసీఎస్ఎస్ఆర్ హైదరాబాద్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు.

- 8లో



పోలీస్ బందోబస్తు భేష్

దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరలో పోలీస్ బందోబస్తు భేషుగ్గా ఉందని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఫిర్యాదుల విభాగాలు ఏర్పాటు చేయాలి

నల్లగొండ: రైతు భరోసా ఫిర్యాదుల స్వీకరణకు జిల్లాలోని అన్ని మండల వ్యవసాయ అధికారుల కార్యాలయాల్లో ఫిర్యాదుల విభాగాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం ఆమె నల్లగొండ కలెక్టరేట్ నుంచి రైతు భరోసాపై జిల్లా, మండల అధికారులతో టెలికాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి మాట్లాడారు. జిల్లాలో మొదటి విడతలో భాగంగా సుమారు 12వేల ఎకరాలు వరకు వ్యవసాయ యోగ్యంకాని భూములను గుర్తించామన్నారు. ఈ వివరాలను శనివారంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫిర్యాదులు స్వీకరించి సోమవారం ప్రజావాణిలోపు పరిష్కరించాలని ఆదేశించారు. యూరియా కోసం రైతుల ఇబ్బందులు పడకుండా సరఫరా చేయాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జెజశ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డీఏఓ శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాగరాజు

నల్లగొండ టౌన్: విద్యారంగ సమస్యను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నల్లగొండలోని ఎఫ్‌సీఐ కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభమైన ఎస్ఎఫ్ఐ 45వ జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని కోరారు. మెస్, కాస్మోటిక్ చార్జిలు, పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలన్నారు. ఈ సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.కిరణ్, ప్రతినిధులు లక్ష్మీనారాయణ, సలీం, సత్తయ్య, మల్లం మహేష్, నరేష్, కంబంపాటి శంకర్, సైదానాయక్, కుంచం కావ్య, లక్ష్మణ్, కోరె రమేష్, బుడిగె వెంకటేష్, ముస్కు రవీందర్, స్పందన, సిరి, జగన్, వీరన్న, సంపత్, సైఫ్, కిరణ్, జగదీష్, రవి, రోహిత్ పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: జిల్లాలోని 1 నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థుల (అంధ, బధిర, మానసిక, శారీరక దివ్యాంగులు)కు ఉపకార వేతనాలు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షేమశాఖ అధికారి కేవీ.కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 శాతం అంగవైకల్యం కలిగినట్టు డాక్టర్ ధ్రువీకరణ పత్రంతోపాటు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, 2 ఫొటోలు, 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల గత సంవత్సరం మార్కుల జాబితా, పాఠశాల బ్యాంకు ఖాతా నంబర్ మొదటి పేజీ జిరాక్స్ జత చేసి దరఖాస్తు చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తులను మార్చి 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా telanganaepass.cgg.gov.inలో సంబంధిత ప్రధానోధ్యాయుడి నుంచి సిఫారసు చేసిన కాపీతోపాటు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ జేడీగా రమేష్

నల్లగొండ అగ్రికల్చర్: జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌గా డాక్టర్ జీవీ రమేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాగర్ కర్నూలు జిల్లాలో డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఈయన పదోన్నతిపై జిల్లా జాయింట్ డైరెక్టర్‌గా రానున్నారు. రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం జేడీఏగా ఏడీ ఖదీర్ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థుల సంక్షేమానికి కృషిచేయాలి

నల్లగొండ: విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా వసతి గృహ సంక్షేమ అధికారులు కృషిచేయాలని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి అన్నారు. బుధవారం నల్లగొండలోని టీఎన్జీఓ భవన్‌లో జరిగిన వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ హాస్టళ్లలో అన్నిరకాల సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడతానని అన్నారు. ఈ సభలో బి.రణధీవే, శేఖర్‌రెడ్డి, ఏ.సత్యనారాయణ, సైదానాయక్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, గామయ్య, రమ్య సుధా, అలీమ్, బాలకృష్ణ, లింగయ్య, యాదగిరి, జానీవియా, సునీత తదితరులు పాల్గొన్నారు.

వరి.. తడారి..

అడుగంటిన భూగర్భజలాలు.. ఎండిపోతున్న పొలాలు



వరిపొలంలో గేదెను మేపుతున్న ఈయన మునుగోడు మండలంలోని పులిపలుపుల గ్రామానికి చెందిన రైతు సింగం మల్లేష్. తనకున్న 6 ఎకరాల్లో వరిసాగుచేశాడు. నాటేసిన సమయంలో బోరు నుంచి నీరు బాగానే వచ్చింది. ఇటీవల ఎండ తీవ్రత పెరగడంతో బోర్లలో నీరు తగ్గిపోయింది. సరిపడా రాకపోవడంతో దాదాపు 3 ఎకరాల్లో పంట పూర్తిగా ఎండిపోయింది. చేసేది ఏమిలేక ఎండిన వరి పొలంలో తన పశువులను మేపుతున్నాడు. ఎకరానికి రూ.20 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే పంట ఎండిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని వాపోతున్నాడు.

- వట్టిపోతున్న బోర్లు.. అన్నదాతల దిగాలు
- పొట్టకొచ్చిన దశలో వందల ఎకరాల్లో ఎండుతున్న వరిచేలు
- ప్రత్యామ్నాయం లేక పంటలను వదులుకుంటున్న రైతులు
- ట్యాంకర్ల ద్వారా నీరు పోస్తున్నా.. కానరాని ప్రయోజనం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఎండల తీవ్రత పెరుగుతుండటంతో భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోతున్నాయి. దీంతో బోర్లు వట్టిపోతుండటంతో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పంట ఎండిపోతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. జిల్లాలో గత ఏడాది యాసంగిలో 4.20 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, ఈసారి 5.12 లక్షల ఎకరాల్లో సాగు చేశారు.

పాతాళానికి భూగర్భ జలాలు

నల్లగొండ జిల్లాలో 33 మండలాలు ఉంటే.. పది మండలాల్లో భూగర్భ జలాలు తగ్గిపోయాయి. నాంపల్లి మండలంలో గతేడాది జనవరి కంటే ఈ జనవరిలో అదనంగా 3.18 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మర్రిగూడ, కొండమల్లేపల్లి, మునుగోడు, కట్టంగూర్, చింతపల్లి, దేవరకొండ, గుండపల్లి, శాలిగౌరారం, మాడుగులపల్లి మండలాల్లోనూ భూగర్భ జలాలు తగ్గిపోయాయి. ఫిబ్రవరి నెలలో అవి మరింతగా లోతుకు పడిపోయి ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

శాలిగౌరారంలో భారీగా నష్టం

శాలిగౌరారం మండలంలో సాగునీటి వనరులు సరిగ్గా లేని భైరవునిబండ, తక్కెళ్లపహాడ్, ఆకారం, వల్లాల, పెర్కకొండారం గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా పడిపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. మండలంలో ఈ సీజన్‌లో 19 వేల ఎకరాలలో వరి పంట సాగు చేయగా, అందులో దాదాపు 400 ఎకరాల్లో పంట ఎండిపోయింది. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు కొత్తగా బోర్లు వేసినా పడకపోవడంతో రైతులు పంటలను వదిలేయాల్సి వస్తోంది.

జనవరి నెలలో భూగర్భ జలమట్టం ఇలా..(మీటర్లలో)			
మండలం	గతేడాది	ఈసారి	పడిపోయింది
నాంపల్లి	9.44	12.62	3.18
మర్రిగూడ	8.36	9.99	1.63
కొండమల్లేపల్లి	4.82	6.0	1.18
మునుగోడు	7.55	8.51	0.96
కట్టంగూర్	8.76	9.54	0.78
చింతపల్లి	10.15	10.86	0.71
దేవరకొండ	7.28	7.83	0.55
గుండ్లపల్లి	6.87	6.35	0.48
శాలిగౌరారం	4.20	4.53	0.33
మాడుగులపల్లి	7.94	8.03	0.10

ట్యాంకర్ల ద్వారా నీరు

చిట్యాల మండలంలో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, పలు గ్రామాల్లో నీరందక పంట ఎండిపోతోంది. కొంతమంది రైతులు ట్యాంకర్ల నీటిని పోస్తున్నారు. పెద్దకాపర్తిలో దాదాపు 20 మంది రైతుల బోర్లు వట్టిపోయాయి. దీంతో ఆ గ్రామంలో దాదాపు 50 ఎకరాల్లో వరి పంట ఎండిపోయింది. మునుగోడు మండలంలోనూ పంటలు ఎండిపోతున్నాయి. వర్షాలు పెద్దగా పడక, భూగర్భ జలాలు పెరుగకపోవడం, చెరువులు, కుంటల్లో సరిపడ నీరు లేకపోవడంతో బోర్లు నీరుపోయడం లేదు.



చిట్యాల మండలం పెద్దకాపర్తిలో వరిపొలానికి ట్యాంకర్ ద్వారా నీరు అందిస్తున్న రైతు



శాలిగౌరారం మండలం అడ్లూరులో నీళ్లులేక వట్టిపోయిన వ్యవసాయ బావి

400 ఎకరాల్లో ఎండిన వరి

నార్కట్‌పల్లి మండలంలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. కొండపాకగూడెం, శేరుబావిగూడెం, ఎల్లారెడ్డిగూడెం, చెర్వుగట్టు, నెమ్మని, మాదవఎడవల్లి గ్రామాల్లో బోర్లపై ఆధారపడి వేసిన వరి పంట ఎండిపోయి పొలాలు నెర్రెలుబారుతున్నాయి.పొలాల్లో కొందరు రైతులు గొర్రెలు, మేకలు మేపుతున్నారు. మండల వ్యాప్తంగా 20 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 400 ఎకరాల్లో వరి పంట ఎండిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తిప్పర్తి మండలంలోనూ భూగర్భ జలాలు అడుగంటిపోయి పంటలు ఎండిపోతున్నాయి. మండలంలోని సర్వారం గ్రామంలో భూగర్భ జలాలు అడుగు అంటడంతో గుర్రప్పగూడెం ప్రాంతంలో బోర్లు వట్టిపోయాయి. పొలాలు పొట్ట దశకు రావడంతో నీరు అధికంగా అవసరం అవుతుందని, ఈ సమయంలో బోర్లలో నీరు తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

400 ఫీట్లు బోరువేసినా చుక్కనీరు రాలే..

గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామానికి చెందిన మాదగాని అంజయ్య తనకున్న రెండెకరాల్లో వరి వేశాడు. మొదట్లో పంట బాగానే ఉంది. ప్రస్తుతం భూగర్భ జలాలు అడుగంటిపోయి, బోర్ల నుంచి నీరు రావడం తగ్గిపోయి, వారం రోజుల నుంచి పంటలు ఎండిపోతున్నాయి. సమీపంలో 400 ఫీట్ల లోతుకు బోర్లు వేసినా చుక్క నీరు రావడం లేదని అంజయ్య వాపోయాడు. నల్లగొండ మండంలోనూ భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. బోర్లు సరిగా నీరు పోయకపోవడంతో పంటలకు సరిపడా నీరందడం లేదు. ఓ రైతు నాలుగు బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నాడు.



నీరు రాని బోరు పాయింట్ దగ్గర రైతు మాదగాని అంజయ్య

పంటలు సాగుచేసి అప్పులపాలయ్యాం



రెండెకరాలలో వరి సాగుచేశాను. చేను పొట్టదశకు వచ్చే సమయానికి రెండు బోర్లలో నీరు తగ్గిపోయింది. దీంతో వరిచేను మొత్తం ఎండిపోయింది. కొత్తగా బోర్లు వేద్దామంటే పడే పరిస్థితి లేదు. చేసేదేమీ లేక వరిచేనును వదిలేశాను. పంట పెట్టుబడి కోసం రూ.60 వేలకు పైగా అప్పు చేయాల్సి వచ్చింది. ఆ అప్పు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

- జాల ఉపేందర్, వల్లాల, శాలిగౌరారం

వరి పంట ఎండిపోతోంది



గుర్రప్పగూడె శివారులో నాలుగు ఎకరాల్లో వరి సాగుచేశాను. ప్రస్తుతం బోర్లు సరిగ్గా పోయకపోవడంతో ఎకరంన్నర పొలం ఎండిపోయింది. మిగిలిన పొలానికైనా నీరు సరిపడ వస్తదనే నమ్మకం లేదు. తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది.

- తగుళ్ల మల్లయ్య, సర్వారం

నాలుగు బోర్లు వేసినా నీరులేదు



నాకున్న రెండెకరాల్లో వరి వేశాను. రెండు బోర్లలో ఒక్కసారిగా నీరు తగ్గిపోయింది. రూ.లక్షన్నర అప్పు చేసి మరో 4 బోర్లు వేశాను. ఒక్క దాంట్లోనూ నీరు రాలేదు. నీరందకపోవడంతో ఎకరం పొలం ఎండిపోయింది.

- ఓరుగంటి పాండు, అప్పాజీపేట

ట్యాంకర్లతో నీరుపెడుతున్నా



నాకున్న నాలుగెకరాలతో పాటు మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి పంట సాగుచేశాను. ఇప్పుడు బోర్ల నుంచి నీరు రావడం లేదు. పంట ఎండిపోతోంది. దీంతో ట్యాంకర్‌తో నీరు తెచ్చి పొలం పారిస్తున్నా.

- ఈరటి వెంకట్ యాదవ్, పెద్దకాపర్తి, చిట్యాల



శాలిగౌరారం మండలం వల్లాల గ్రామంలో ఎండిపోయిన వరిచేను



తిప్పర్తి మండలం సర్వారంలో ఎండిన వరిపొలం

భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ: దామరచర్ల మండలం వాడపల్లిలోని శ్రీమీనాక్షి అగస్త్యేశ్వరస్వామి ఆలయానికి మహా శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం ఆమె వాడపల్లిలోగల శ్రీమీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణా-మూసీ సంగమం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ ఆలయానికి మహాశివరాత్రికి వచ్చే భక్తుల కోసం షవర్‌బాత్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఎప్పటికప్పుడు ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్యను ఆదేశించారు. అనంతరం ఆమె స్థానిక కేజీబీవీ పాఠశాల, మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి పూజిత ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఆ తర్వాత తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్ జవహర్‌లాల్, ఆలయ ఏఈ జ్యోతి, అనువంశిక ధర్మకర్త సిద్ధయ్య, ఎంపీడీఓ, మెడికల్ ఆఫీసర్ తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నెలవారం.. జనహోరం



నెలవారం కార్యక్రమంలో భాగంగా బోనంతో వస్తున్న మెంతబోయిన వంశస్తులు



భేరీలు మోగిస్తున్న యువకులు

- భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు
- కేసారం చేరిన దేవరపెట్టె
- నేడు జాతర ముగింపు

చివ్వెంల, సూర్యాపేట టౌన్: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతరలో నాలుగోరోజు కూడా భక్తుల కోలాహలం నెలకొంది. బుధవారం సంప్రదాయం ప్రకారం నెలవారం కార్యక్రమాన్ని యాదవ పెద్దలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లింగమంతుల స్వామిని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ తదితరులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం మకరతోరణం తరలింపుతో జాతర ముగియనుంది.

నేడు ముగియనున్న జాతర

నాలుగు రోజులుగా లక్షలాది భక్తుల పూజలు అందుకున్న పెద్దగట్టు లింగమంతుల జాతర గురువారంతో ముగియనుంది. సూర్యాపేట యాదవ బజార్ నుంచి గట్టుకు తెచ్చిన మకర తోరణం గురువారం స్వస్థలానికి చేరనుంది. మకర తోరణం తీసుకువెళ్లడంతో జాతర ముగుస్తుందని యాదవ పూజారులు తెలిపారు.

దేవరపెట్టె తరలింపు

పెద్దగట్టు లింగమంతుల జాతరలో నాలుగోరోజు నెలవారం తంతును నిర్వహించారు. అనంతరం చంద్రపట్నం ఎత్తిపోసి సమీపంలోని నాగులమ్మ పుట్టలో పోశారు. తర్వాత చౌడమ్మ, లింగమంతుల విగ్రహాలు ఉన్న దేవరపెట్టెను తీసుకొని మెంతనబోయిన, గొర్ల వంశీయులు సూర్యాపేట మండలం కేసారం బాటపట్టారు. దీంతో నెలవారం పండుగ ముగిసినట్లు అధికారులు ప్రకటించారు.

స్వస్తివాచనం.. విష్వక్సేనారాధన

- యాదగిరి క్షేత్రంలో ప్రారంభమైన మహా కుంభాభిషేక సంప్రోక్షణ
- పూజల్లో పాల్గొన్న దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో భాగంగా బుధవారం ఉదయం ప్రధానాలయంలోని ముఖ మండపంలో స్వస్తి వాచనం, విష్వక్సేన ఆరాధనతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. ముఖ మండపంతో పాటు గర్భాలయంలో, ఆలయ పరిసరాల్లో పుణ్యాహ వాచనం జరిపించారు. ప్రధానాలయ ముఖ మండపం నుంచి యాగశాలకు ఊరేగింపుగా శ్రీస్వామి అమ్మవార్లను ప్రత్యేక సేవపై తీసుకువచ్చారు. యాగశాల వద్ద ప్రవేశ పూజను నిర్వహించి యాగశాల మంటపం ఎదుట స్వయంభూ అగ్ని సృష్టించే కార్యక్రమం చేపట్టారు. అనంతరం పంచ కుండాత్మక యాగానికి అగ్ని ప్రతిష్ఠాపన చేసి హోమాది పూజలు జరిపించారు. అదేవిధంగా రాత్రికి శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం, ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల, అగ్ని ఆరాధన, మూర్తి మంత్ర హోమాలు, వారుణానువాక హోమం చేసి, జలాధివాసం నిర్వహించారు.

భక్తులకు సదుపాయాలు కల్పించాలి

కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాలయ అధికారులు సదుపాయాలు కల్పించాలని దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. సంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా ఈ సందర్భంగా కొండపైన గల దేవాలయ కార్యాలయంలో కలెక్టర్ హనుమంతరావు, ఆలయ ఈఓ భాస్కర్‌రావుతో కలిసి వివిధ శాఖల అధికారులతో దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 23న మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు అధికంగా వస్తారని, వారికి ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. పలు అంశాలపై అధికారులతో చర్చించారు. అంతకు ముందు కొండ కింద హెలిపాడ్ స్థలం, కొండపైన స్వాగత తోరణానికి ఇరువైపులా వేస్తున్న రంగులు, ఘాట్‌రోడ్డు, ప్రధానాలయాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఏసీపీ రమేష్, ప్రధానార్చకులు, జిల్లా అధికారులు, ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులకు కంకణధారణ చేస్తున్న ప్రధానార్చకులు



స్వస్తివాచనం నిర్వహిస్తున్న అర్చకులు





ఛత్రపతికి ఘన నివాళి

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలో హిందువాహిని సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన శోభాయాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ర్యాలీలో పాల్గొన్న బీజేపీ, ప్రతినిధులు, యువకులు


పెద్దగట్టు జాతరకు భారీగా తరలివచ్చిన భక్తులు


బోనం వండుతున్న మున్న, మెంతబోయిన వంశస్తులు


స్వామి వారికి బోనం సమర్పించేందుకు వస్తున్న భక్తులు


క్యూ లైన్‌లో కిక్కిరిసిన భక్తులు

క్లుప్తంగా

348 మంది దాతలకు ఆహ్వానం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ స్వర్ణ దివ్య విమాన గోపురానికి మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవానికి హాజరుకావాలని 348 మంది దాతలకు ఆహ్వానం పంపినట్లు ఈఓ భాస్కర్‌రావు బుధవారం వెల్లడించారు. దివ్య విమాన గోపురానికి బంగారు తాపడం కోసం బంగారం, నగదుతో పాటు చెక్కులను అందజేసిన దాతలందరినీ ఈ మహోత్సవానికి ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. 23వ తేదీన నిర్వహించే ఈ వేడుకకు వచ్చే దాతలందరికీ తూర్పు మాడ వీధిలోని కల్యాణ మండపం వద్ద కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దాతలందరికి సన్మానించి, స్వామి వారి ప్రసాదం అందజేస్తామని ఈఓ పేర్కొన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ

- 19 తులాల బంగారం, రూ.10 వేల నగదు అపహరణ

దేవరకొండ: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి 19తులాల బంగారం, రూ.10వేల నగదు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరకొండ పట్టణంలోని తాటికోల్ చౌరస్తా వద్ద గల మీనాక్షి ప్లాజా అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న శీలా వాసు స్థానికంగా కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం వాసు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆస్పత్రి పని నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో పక్కింటి వారు వాసు ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటం గమనించి వాసుతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. ఇంటికి తిరిగి వచ్చిన వాసు బీరువాలో దాచిన 19తులాల బంగారంతో పాటు రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. దేవరకొండ సీఐ నర్సింహులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. అపార్ట్‌మెంట్‌లో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను ఎస్‌ఐలు నారాయణరెడ్డి, కోటేష్ పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రూ.70కోట్లతో పెద్దగట్టు అభివృద్ధి చేస్తాం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- లింగమంతుల స్వామికి పూజలు


మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కంకణం కడుతున్న ఆలయ కమిటీ సభ్యులు, పక్కన ఎమ్మెల్యే వీరేశం

చివ్వెంల: చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలో గల పెద్దగట్టు లింగమంతులస్వామి ఆలయాన్ని రూ.70 కోట్లతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పెద్దగట్టు జాతరకు మంత్రి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దగట్టు ఆలయం వద్దకు ఘాట్ రోడ్డుతో పాటు శాశ్వత గెస్ట్‌హౌస్‌లు నిర్మిస్తామని, భక్తుల కోసం గుడి వద్ద వసతి సౌకర్యం కల్పిస్తామని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలో ఎస్సారెస్పీ కాలువలు తవ్వించారని అన్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గం పనులు త్వరలో పూర్తిచేసి ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. కల్వకుంట్ల కవిత బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఎప్పుడూ పెద్దగట్టు జాతరకు రాలేదని, ఇప్పుడు వచ్చి పసలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి బలమైన క్యాడర్ ఉందని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరో ఇరవై ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ మతంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై మంత్రి స్పందిస్తూ.. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఓట్లు గాని సీట్లు గాని వచ్చే పరిస్థితి లేదన్నారు. తమ ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట ఆలేరు, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి, ఆలయ చైర్మన్ నర్సయ్యయాదవ్ పాల్గొన్నారు.

మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్

- ఐసీఎస్ఎస్ఆర్–హైదరాబాద్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): సుస్థిర అభివృద్ధి సాధిస్తూ, సమస్యలను అధిమిస్తూ భారతదేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదుగుతోందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్)–హైదరాబాద్ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐసీఎస్ఎస్ఆర్, తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో కళాశాల సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించిన 'సుస్థిర అభివృద్ధి–భారతదేశంలో అవకాశాలు మరియు సవాళ్లు' అనే అంశంపై నిర్వహించిన నేషనల్ సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సెమినార్లు నిర్వహించడానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. మరొక అతిథి ప్రొఫెసర్ మల్లయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలో పేదరికం, అసమానతలను అంతంచేసేలా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. సుస్థిర అభివృద్ధిపై పలువురు పరిశోధనా పత్రాలను సమర్పించారు. అనంతరం సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఎకనామిక్స్ హెడ్ ప్రొఫెసర్ ఫరీదా బేగం, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ ఆకుమార్తి నాగేశ్వరరావు, ప్రొఫెసర్ మల్లయ్య, ప్రొఫెసర్ ఎం. రాములు, బీఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ దయాకర్, సెమినార్ కన్వీనర్ డాక్టర్ బి. మునిస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆది మల్లేశం, కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పెద్దగట్టు జాతరలో పోలీస్ బందోబస్తు భేష్

- మల్టీజోన్–2 ఐజీ వి. సత్యనారాయణ


లింగమంతుల స్వామికి మొక్కుతున్న ఐజీ సత్యనారాయణ, పక్కన ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

సూర్యాపేటటౌన్: దురాజ్‌పల్లి లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరలో పోలీసులు బందోబస్తు పకడ్బందీగా నిర్వహిస్తున్నారని మల్టీజోన్–2 ఐజీ వి. సత్యనారాయణ అన్నారు. బుధవారం లింగమంతులస్వామిని ఆయన దర్శంచుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేశారని కితాబిచ్చారు. సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి జాతర పరిసరాలను పరిశీలించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టంగా అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రత్యేక టీమ్స్ ఏర్పాటు చేసి జాతరలో దొంగతనాలు జరగకుండా నివారించారని తెలిపారు. ట్రాఫిక్ మళ్లింపునకు సహకరించిన వాహనదారులు, భక్తులకు ధన్యవాదాలు తెలిపారు. ఆయన వెంట సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ రవి, సీఐలు రాజశేఖర్, వీరరాఘవులు, స్థానిక ఎస్‌ఐ మహేశ్వర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.


అజీంపేటలో కొనసాగుతున్న పోలీస్ పికెట్

అడ్డగూడూరు: మండలంలోని అజీంపేట గ్రామంలో పోలీసు పికెట్ కొనసాగుతోంది. అజీంపేటకు చెందిన పందుగ రాజమల్లు మృతికి అదే గ్రామానికి చెందిన భట్ట లింగయ్యనే కారణమని రాజమల్లు కుమారుడు రామస్వామి కక్ష పెంచుకున్నాడు. 2017 దసరా రోజు భట్ట లింగయ్య గ్రామంలో జమ్మి పూజ వద్దకు రాగా.. రామస్వామితో సహా మరో 17 మంది గ్రామస్తులతో కలిసి మూకుమ్మడిగా అతడిపై దాడి చేశారు. చికిత్స నిమిత్తం లింగయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. లింగయ్య కుమారుడు వెంకన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి రామస్వామితో పాటు 17మందిని అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. ఈ కేసు తుది విచారణలో భాగంగా సాక్ష్యాధారాలను పరిశీలించిన నల్లగొండ ఎస్సీ, ఎస్టీ కోర్టు మూడో అదనపు జడ్జి జడ్జీ రోజారమణి 18మందికి జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించారు. వీరిలో జక్కుల భిక్షమయ్య గతంలోనే మృతిచెందగా.. మిగతా 17 మందిని నల్లగొండ జైలుకు తరలించారు. అజీంపేటలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా బుధవారం కూడా పోలీసు పికెట్ కొనసాగించినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

పందెంరాయుళ్లపై కేసు

నేరేడుచర్ల: నేరేడుచర్ల మండలం కందులవారిగూడెం గ్రామ శివారులో కోడి పందేలు ఆడుతున్న 8 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ బుధవారం విలేకరులకు తెలిపారు. బహిరంగంగా కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేసి ఆరుగురిని పట్టుకోగా.. మరో ఇద్దరు పరారైనట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.4వేల నగదు, 6 మోటారు సైకిళ్లు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

యాదగిరిగుట్టలో వైభవంగా గిరి ప్రదక్షిణ


ఆలయం చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం భక్తులు, ఆలయాధికారులు, స్థానికులు గిరి ప్రదక్షిణ చేపట్టారు. ఉదయం 5గంటలకు కొండ కింద గల వైకుంఠ ద్వారం వద్ద ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తిలు ప్రత్యేక పూజలు చేసి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అంతకుముందు కూచిపూడి, భరతనాట్యంతో కళాకారులు భక్తులను ఆకట్టుకున్నారు. ఆలయంలో స్వాతి హోమాన్ని నిర్వహించి, స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అష్టోతర శతఘటాభిషేకం చేపట్టారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వర్ణ దివ్య విమాన గోపుర మహా కుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి ఆలయ సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభించారు. సాయంత్రం విజయవాడకు చెందిన ఎంవీ సుధాకర్‌చే కర్ణాటక సంగీతం, రాత్రి హైదరాబాద్‌కు చెందిన శాంకరి కూచిపూడి నృత్యం వారు, ఇందిరా కళానికేతన్ మహతి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.



నృత్య ప్రదర్శన ఇస్తున్న కళాకారులు



జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- అదుపుతప్పి ఢీకొన్న రెండు కార్లు
- ఇద్దరు మృతి.. మరో ఐదుగురికి గాయాలు
- మృతుల్లో 7 నెలల పసికందు
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద ఘటన


సాయికుమార్ మృతదేహం


విరాంచ్ మృతదేహం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయికుమార్ కుటుంబ సభ్యులు

చౌటుప్పల్ రూరల్: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ వద్ద బుధవారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తితో పాటు 7 నెలల పసికందు మృతిచెందగా.. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేటకు చెందిన సుంకి సాయికుమార్(35), తన భార్య సింధూజ, కుమారుడు విరాంచ్(7 నెలలు)తో కలిసి హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో నివాసముంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. సాయికుమార్ బుధవారం సాయంత్రం భార్య, కుమారుడితో పాటు తన తల్లిదండ్రులతో కలిసి పటాన్‌చెరు నుంచి కారులో సూర్యాపేటకు వెళ్తున్నాడు. అదే సమయంలో నల్లగొండలోని గోకుల్ బీఈడీ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్న నల్లగొండకు చెందిన జె. సందీప్‌రెడ్డి, తన భార్య పద్మతో కలిసి నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్నాడు. చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ సమీపంలోకి రాగానే సందీప్‌రెడ్డి కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి హైదరాబాద్ నుంచి విజయవాడ రూట్‌లో వస్తున్న సాయికుమార్ కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికుమార్‌తో పాటు అతడి కుమారుడు విరాంచ్ అక్కడికక్కడే మృతి చెందారు. సాయికుమార్ తండ్రి వెంకన్న, తల్లి విజయ, భార్య సింధూజ తీవ్రంగా గాయపడ్డారు. జె. సందీప్‌రెడ్డి, అతడి భార్య పద్మకు కూడా గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కార్లను హైవే పక్కకు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ఐదుగురిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని చౌటుప్పల్ సీఐ జి. మన్మథకుమార్ తెలిపారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం

- ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి


మిర్యాలగూడలో రాస్తారోకో చేస్తున్న ఎంసీపీఐయూ నేతలు

మిర్యాలగూడ: కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి నిధులు కేటాయించకుండా బీజేపీ ప్రభుత్వం అన్యాయం చేసిందని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కేంద్ర బడ్జెట్ అనుకూలంగా ఉందని, పేదలకు, రైతులకు, కార్మికులకు, కూలీలకు, మహిళలకు, విద్యార్థులకు వ్యతిరేకంగా ఉందన్నారు. రాష్ట్రంలో 8మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి, వస్కుల మట్టయ్య, కుమారస్వామి, వరికుప్పల వెంకన్న, వనం సుధాకర్, పెద్దారపు రమేష్, నజీర్, సైదమ్మ, కాశీ, ప్రతాప్, రాగసుధ, సంధ్య, సావిత్రి, వెంకన్న, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పరారీలో కచలాపురం వీఓఏ..?

- మహిళా సంఘాల డబ్బులు బ్యాంకులో చెల్లించకుండా మోసం
- రెండు రోజుల క్రితం ఐకేపీ అధికారులతో పాటు వీఓఏను నిర్బంధించగా విడిపించిన పోలీసులు

మునుగోడు: మునుగోడు మండలం కచలాపురం గ్రామంలో మహిళా సంఘాల సభ్యుల డబ్బులను బ్యాంకులో జమచేయకుండా సొంతానికి వాడుకున్న ఆ గ్రామ వీఓఏ సుఖేందర్ పరారీలో ఉన్నట్లు సమచారం. మహిళా సంఘాల సభ్యులు శ్రీనిధి రుణాలతో పాటు ఇతర రుణాల వాయిదా డబ్బులను ప్రతి నెలా రూ.90వేల వరకు వీఓఏకు చెల్లించగా.. అతడు కేవలం రూ.40వేల నుంచి రూ.50వేల వరకు మాత్రమే బ్యాంకులో జమచేసి మిగిలిన డబ్బులు తన సొంతానికి వాడుకున్నాడు. ఇది గుర్తించిన ఐకేపీ ఏపీఎంతో పాటు సీసీ సోమవారం కచలాపురంలో సమావేశం ఏర్పాటు చేసి వీఓఏ రూ.11లక్షలు వాడుకున్నట్లు నిర్ధారించారు. దీంతో ఆగ్రహించిన మహిళా సంఘాల సభ్యులు అదే రోజు ఐకేపీ అధికారులతో పాటు వీఓఏని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి తాళం వేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని మహిళలకు సర్దిచెప్పి వారిని విడిపించారు.

ఐ.పీ. పెట్టేందుకు ప్రయత్నం..

ఐకేపీ అధికారులు వీఓఏ సుఖేందర్‌పై మునుగోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకోగా.. కచలాపురం గ్రామంలోని కొందరు పెద్దలు, అతడి కుటుంబ సభ్యులు మహిళ సంఘాల సభ్యులకు ఇవ్వాల్సిన డబ్బులు తాము ఇప్పిస్తామని, అప్పటి వరకు కేసు నమోదు చేయొద్దని జమానతుపై తీసుకెళ్లారు. కానీ రెండు రోజుల నుంచి అతడు గ్రామంలో కనిపించడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అతడు మహిళా సంఘాల సభ్యులకు చెల్లించాల్సిన డబ్బులు ఇప్పట్లో చెల్లించకుండా కోర్టు ద్వారా ఐపీ(ఇన్‌సాల్వెన్సి పిటిషన్) పెట్టే ప్రయత్నంలో ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. వీఓఏ సుఖేందర్‌కు బయట అప్పులు కూడా అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది.

రైతును వెంబడించి నగదు చోరీ

- ధాన్యం అమ్మి డబ్బు తీసుకొస్తుండగా దాడి చేసి అపహరించిన దుండగులు
- అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో ఘటన


బాధితుడు పుల్లయ్య

అనంతగిరి: ధాన్యం విక్రయించగా వచ్చిన డబ్బుతో ఓ రైతు ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా దుండగులు ఆ రైతును వెంబడించి అతడిపై దాడి చేసి రూ.1,77,817 నగదు ఎత్తుకెళ్లారు. అనంతగిరి మండలం శాంతినగర్ శివారులో జరిగిన ఈ ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం గోండ్రియాల గ్రామానికి చెందిన రైతు కొండబాల పుల్లయ్య సోమవారం తాను పండించిన వరి ధాన్యాన్ని ఖమ్మం జిల్లా నేలకొండపల్లికి చెందిన ఓ వ్యాపారికి విక్రయించాడు. మంగళవారం ఉదయం నగదు తీసుకువెళ్లాంటూ సదరు ధాన్యం వ్యాపారి నుంచి ఫోన్ రావడంతో పుల్లయ్య నేలకొండపల్లి వెళ్లి నగదు తీసుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. మార్గమధ్యలో అనంతగిరి మండలం శాంతినగర్ శివారులోని సర్వీస్ రోడ్డులో గల రైస్ మిల్లు వద్దకు చేరుకోగానే స్కూటీపై వచ్చిన గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు పుల్లయ్యను ఆపే ప్రయత్నం చేశారు. వారిపై అనుమానం వచ్చిన పుల్లయ్య ద్విచక్ర వాహనం వేగం పెంచగా.. కొద్దిదూరం వెళ్లాక పుల్లయ్య అడ్డగించారు. దీంతో పుల్లయ్య డబ్బులు ఉన్న ప్లాస్టిక్ కవర్‌తో సహా పారిపోతుండగా.. ముగ్గురు దుండగులు అతడిపై దాడి చేసి నగదు ఉన్న కవరును లాక్కొని పారిపోయారు. పుల్లయ్య విలపిస్తూ అటుగా వస్తున్న ఓ కారుకు ఎదురుగా వెళ్లి జరిగిన విషయం చెప్పాడు. యూటర్న్ చేసుకుని పారిపోతున్న దుండగులను కారులోని వ్యక్తి ఆపే ప్రయత్నం చేసినప్పటికీ వారు తప్పించుకుపోయారు. బాధితుడు అనంతగిరి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి తెలిపారు.

బైక్ ట్యాంకు కవర్‌లో నుంచి రూ.2లక్షలు అపహరణ

హాలియా: బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టిన రూ.2లక్షల నగదును దుండగులు చోరీ చేశారు. ఈ ఘటన హాలియా పట్టణంలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం తెప్పలమడుగుకు చెందిన కొండల్ బైక్‌పై బుధవారం హాలియాలోని ఎస్‌బీఐలో నగదు డ్రా చేసేందుకు వచ్చాడు. రూ.2లక్షల నగదు డ్రా చేసి కవర్‌లో పెట్టి తన బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టాడు. దేవరకొండ రోడ్డులోని వెంకటేశ్వర ఫర్టిలైజర్ షాపు వద్ద బైక్‌ను నిలిపి షాపులోకి వెళ్లి వచ్చేసరి బైక్ ట్యాంకు కవర్‌లో పెట్టిన నగదు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి నగదు చోరీ చేసి సాగర్ వైపు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.


సీసీ ఫుటేజీలో అనుమానితుల దృశ్యాలు

క్లుప్తంగా

చోరీకి గురైన సెల్‌ఫోన్లు అప్పగింత



సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న పోలీసులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. సుమారు 25 సెల్‌ఫోన్‌లను సీఈఐఆర్ యాప్ ద్వారా ఛేదించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఆ ఫోన్లను పోగొట్టుకున్నవారికి అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శేఖర్, హెడ్ కానిస్టేబుల్ రేవతి, బాధితులు ముదిరెడ్డి సునిత, పాలడుగు నాగార్జున ఉన్నారు.

పుస్తకాల బహూకరణ



పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ పద్మ

కనగల్ : మండలంలోని దోరెపల్లి, రేగట్టె, కురంపల్లి ఉన్నత పాఠశాలల గ్రంథాలయాలకు రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి రాసిన వివిధ కథల పుస్తకాలను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వల్లపట్ల పద్మ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వెంకటేశ్వరగుప్తా, మురళి, శ్రీనివాసరెడ్డి, సునీతారాణి అరుణ, కిరణ్, మోహన్, కురంపల్లి ప్రధానోపాధ్యాయుడు శేఖర్, బండారు శ్రీనివాస్, పద్మావతి, నరేందర్‌రెడ్డి, రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నల్లగొండ: అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై నల్లగొండ పట్టణ శివారులోని పానగల్ వద్ద ఫ్లైఓవర్‌పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. నల్లగొండ టూటౌన్ ఎస్ఐ రావుల నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన లారీ తమిళనాడు రాజధాని చెన్నై నుంచి ఢిల్లీకి మందుల లోడ్‌తో వెళ్తోంది. ఈ లారీ అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై నల్లగొండ పట్టణ శివారులోని పానగల్ ఫ్లైఓవర్ పైకి రాగానే ఏపీలోని చీరాల నుంచి చౌటుప్పల్‌లోని దివీస్ కంపెనీకి వెళ్తున్న లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనుక ఢీట్టారు. దీంతో లారీ క్యాబిన్ నుజ్జునుజ్జయింది. లారీ డ్రైవర్ అద్వేక్ (37), క్లీనర్ రాజీవ్ (35) క్యాబిన్‌లో ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్ఐ తెలిపారు.

అంజయ్యకు నేషనల్ అవార్డు



కనగల్: మండల పరిధిలోని బండమీదిగూడెం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బండమీది అంజయ్య డాక్టర్ బాబూ జగ్జీవన్ రావ్ జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 20న హైదరాబాదులోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో మనం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో అంజయ్య అవార్డు అందుకోనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సీమంతాలు

చండూరు (గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల పరిధిలోని తేరేట్‌పల్లి గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సీడీపీఓ లావణ్య గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ వెంకటమ్మ సూపర్‌వైజర్ యాదమ్మ, అంగనవాడీ టీచర్లు ఉషారాణి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నకిరేకల్ : పట్టణ శివారులోని బాబసాహెబ్ గూడెంలో శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి కొండ నాగయ్యగౌడ్ ట్రస్ట్ ద్వారా చైర్మన్ కొండ శ్రీనుగౌడ్ సహకారంతో రూ.10 వేల విరాళాన్ని బుధవారం కల్లు గీత సంఘం అధ్యక్షుడు కొండ జానయ్యగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో భూపతి వెంకటనారాయణగౌడ్, కొండ యాదగిరి, చెంకన్న, భూపతి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వీరభద్రంకు అవార్డు



సేవా రతన్ అవార్డుతో వీరభద్రం

శాలిగౌరారం: మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన భీమన బోయిన వీరభద్రంకు న్యూఢిల్లీకి చెందిన 'మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు' సంస్థ సేవారతన్ అవార్డు న్యూఢిల్లీలో అందించింది. వీరభద్రం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో అమ్మజ్యోతి అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేసి ఐదు సంవత్సరాలుగా ఎంతోమంది అనాథలకు స్వచ్ఛందంగా సేవలు అందిస్తున్నారు. వీరభద్రం సేవలను గుర్తించిన 'మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డు' సంస్థ సేవారతన్ అవార్డుతోపాటూ ప్రశంసా పత్రాన్ని అందించి సత్కరించారు.

రైతులకు తీరని విద్యుత్ కష్టాలు

- ఒక ట్రాన్స్‌ఫార్మర్.. రెండు మండలాలు
- నీటి సరఫరా కోసం రైతుల మధ్య నిత్యం ఘర్షణ
- ఎండుతున్న వరి చేలు
- సమస్యను పరిష్కరించడంలో అధికారులు విఫలం



గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు



ఎండిన వరి చేను

చండూరు (గట్టుప్పల్) : ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ వాడకంలో రెండు మండలాల రైతులు ఘర్షణ పడుతున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ తమదే అంటే తమదే అని ఆ రెండు మండలాలకు చెందిన రైతుల పంచాయితీ చిలికిచిలికి గాలి వానలా తయారైంది. సమస్యను పరిష్కరించాల్సిన విద్యుత్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతంపేట–గట్టుప్పల్ దారిలో 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఆ ట్రాన్స్‌ఫార్మర్ కింద గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామ పరిధిలో 25 వరకు వ్యవసాయ మోటార్లు ఉండగా.. సంస్థాన్ నారాయణపూర్ మండలం లచ్చమ్మగూడెం గ్రామ పరిధికి చెందినవి సుమారు 10 వ్యవసాయ మోటార్లు ఉన్నాయి. 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌పై 35 మోటార్లు నడవడంతో లో ఓల్టేజీ సమస్య ఏర్పడింది. దీంతో 35 మంది రైతులకు చెందిన 70 ఎకరాల వరి చేలు ఎండుతున్నాయి. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు అనేకమార్లు రెండు మండలాల విద్యుత్ అధికారులను కలిసినా స్పందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య ఇలానే కొనసాగితే వ్యవసాయం ఎలా చేసుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటలు 70 శాతం వరకు వరి చేలు ఎండిపోయే దశకు చేరినట్లు రైతులు వాపోతున్నారు.

వంతుల వారీగా..

ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో వంతులవారీగా వ్యవసాయ మోటార్లను ఆన్ చేసుకుని పొలాలకు నీరు పారించుకుంటున్నారు. ఈ క్రమంలో రైతుల మధ్య గొడవలు వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. పంటల సాగుకు విద్యుత్ సమస్య లేకుండా, రైతులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ప్రభుత్వం అధికారులకు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇస్తున్నా కూడా ఎక్కడా అమలు కావడం లేదు. ఇదే విషయంపై గట్టుప్పల్ విద్యుత్ ఏఈ ప్రవీణ్‌రెడ్డిని వివరణ కోరేందుకు ప్రయత్నం చేయగా ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

అధికారులు పట్టించుకోవడం లేదు



రెండు మండలాల రైతులకు ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ కింద 35 వ్యవసాయ మోటార్లు ఉండడంతో లో ఓల్టేజీ సమస్య తీవ్రంగా ఉంది. నాకు సంస్థాన్ నారాయణపురం మండలం లచ్చమ్మగూడెం గ్రామ పరిధిలో భూమి ఉంది. కరంటు కనెక్షన్ మాత్రం అంతంపేట గ్రామ ట్రాన్స్‌ఫార్మర్‌కు ఉంది. నేను ముప్పావు ఎకరం వరి సేద్యం చేస్తే లో ఓల్టేజీతో మోటార్లు పోయక వరి ఎండిపోతోంది. అధికారులు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ బిగించి మా సమస్యకు పరిష్కారం చూపాలి.

– పగిళ్ల జంగయ్య, రైతు

రెండు ఎకరాల వరి ఎండిపోయింది



ఒకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో విద్యుత్ లో ఓల్టేజీ కారణంగా నేను సేద్యం చేసిన రెండు ఎకరాల వరి పంట ఎండిపోయే దశకు చేరింది. పంటను కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నా. ఇప్పటికే రెండు బోర్లు వేసినా నీరు పడలేదు. అధికారులు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అడిగితే.. పట్టించుకోవడం లేదు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో రైతుల పొలాలన్నీ ఎండిపోతున్నాయి. రైతులందరం కలిసి జిల్లా మంత్రి దగ్గరకు వెళ్లి సమస్యను వివరిస్తాం.

– మాదగాని అంజయ్య, రైతు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

శాలిగౌరారం: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి బుధవారం సాయంత్రం కలెక్టర్ శాలిగౌరారం మండలం వంగమర్తి, ఇటుకులపహాడ్ గ్రామాల సరిహద్దులో మూసీనది ఒడ్డున ప్రభుత్వ ఇసుక రీచ్‌లను సందర్శించారు. ఇసుక తవ్వకాలు, స్టాక్ పాయింట్, ఎగుమతి(లోడింగ్), లారీల్లో రవాణా, సీసీ కెమెరాల ఏర్పాటు, వేబ్రిడ్జి నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలోని ప్రతి పాయింట్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరిమితికి మించి ఇసుక తరలింపు జరుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖల పరిధిలో జరిగే ప్రభుత్వ పనులకు ఇసుక అవసరం ఎంత ఉంటుందనే విషయంపై విధివిధానాల రూపకల్పనకు గురువారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, మైనింగ్ ఏడీ జాకబ్, నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ కొండల్‌రెడ్డి, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి ఉన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పన్నాల గోపాల్‌రెడ్డి

చిట్యాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే విద్యారంగ సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి, టీపీటీఎఫ్(తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర మాజీ కార్యదర్శి పన్నాల గోపాల్‌రెడ్డి అన్నారు. చండూరు, మునుగోడు, చిట్యాల మండలాల్లో బుధవారం ఆయన పలువురు ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం చిట్యాలలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఎమ్మెల్సీ కోదండరామ్‌తోపాటు పలు జూనియర్, డిగ్రీ లెక్చరర్లు, పాలిటెక్నిక్ లెక్చరర్లు, గురుకుల సొసైటీ, యూనివర్సిటీ ప్రొఫెసర్స్, ఉపాధ్యాయుల మద్దతుతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నానని తెలిపారు. తనను గెలిపిస్తే విద్యారంగంలో మార్పులు తీసుకువచ్చేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కందుల వెంకట్‌రెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పాఠశాల అభివృద్ధి



వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడుతున్న పానుగోటి అంజన్‌రావు

మర్రిగూడ: పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయుల సమష్టి కృషి అవసరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు పానుగోటి అంజన్‌రావు అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని హైస్కూల్, ఆదర్శ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో పాటు పాఠశాల అభివృద్ధికి నిధులు వెనక్కి మళ్లడంపై ఆరాతీశారు. డీఈఓను ఫోన్‌లో సంప్రదించి తక్షణమే పరిష్కారం చూపించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి, హెచ్‌ఎం కళా శ్రీనివాస్, ఉపాధ్యాయుడు బాలరాజు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి వీరప్ప

చండూరు(గటుప్పల్) : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని గట్టుప్పల్ మండల ప్రత్యేక అధికారి (జిల్లా రైతు శిక్షణ కేంద్రం) ఏడీఏ వీరప్ప సిబ్బందికి సూచించారు. బుధవారం గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఎస్టీ వసతి గృహాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన డైట్ మెనూ కాకుండా ఇష్టానుసారంగా వండి పెట్టడుతుండడతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు డైట్ మెనూ చార్జీలు పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది.. కానీ ఆ మెనూ ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. మరోసారి మెనూ పాటించనట్లు తెలిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వసతి గృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించి, నర్సరీని సందర్శించారు. ఆయన వెంట తహసీల్దార్ రాములు, ఎంపీడీఓ మాధవరెడ్డి, కార్యదర్శి షఫీ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు

నకిరేకల్ : మల్టీ స్పెషాలిటీ వైద్యశాల డాక్టర్లు నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ సీఐ రాజశేఖర్, కాంగ్రెస్ నేత దైద రవీందర్ కోరారు. నకిరేకల్ పట్టణంలో వెంకటరామ(వీరబ్రహ్మం) వైద్యశాల ఆధ్వర్యంలో హైదరాబాద్ మలక్‌పేట యశోద హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల డాక్టర్లు రౌతు శిరీషా, శ్వేత, నవీన్‌కుమార్, కల్యాణ్ చక్రవర్తి, లోకేశ్వరిలు గుండె, ఉపిరితిత్తుల, కిడ్నీ, గైనకాలజీ సమస్యలు, షుగర్, బీపీకి సంబంధించి సుమారు 160 మందికి పైనే ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ రౌతు వీరబ్రహ్మం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ప్రకాష్‌రావు, శంభులింగారెడ్డి, ఎస్.రాంమోహన్‌రావు, సూర్యకుమార్, యల్లపురెడ్డి యాదగిరెడ్డి, బండపల్లి శ్రీనివాస్‌గౌడ్, పొడిచెటి దొడ్డయ్య, దండ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐకి సన్మానం



ఏఎస్ఐని సన్మానిస్తున్న నాయకులు

మునుగోడు: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఇటీవల ఏఎస్ఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లును బుధవారం యాదవ సంఘం నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బూడిద మల్లికార్జున్, జక్కలి శ్రీను, పరమేష, శంకర్, శ్రీశైలం, కొమ్ము మల్లేష్ పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి..

మర్రిగూడ : మండలంలోని దామెరభీమనపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం ఇటీవల డాక్టరేట్ అవార్డుకు ఎంపికయ్యారు. దీంతో లచ్చిరాంను మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం ఎంఈఓ బిట్టు శ్రీనివాస్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలోఎస్ఓ వీరేంద్రకుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయడు కళా శ్రీనివాస్, మాలతి, శారద, ప్రధానోపాధ్యాయుడు పాల్వాయి వెంకట్‌రెడ్డి, రజనీకాంత్, విఠల్, అంజ య్య, రాజేశ్వరి, రమణ, నవీన్, భిక్షం, వెంకట య్య, అల్వాల్‌రెడ్డి, శంకర్, కృష్ణారెడ్డి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగిన ఉద్రిక్తత

తిప్పర్తి : ఇండ్లూర్ సమీపంలో గల ఏఎమ్మార్పీ డీ–40 కెనాల్ కింద ఉన్న ఎల్–11 సబ్ కెనాల్ మూడో తూమును మంగళవారం మోత్కూర్ గ్రామ రైతులు పూడ్చడంతో మామిడాల గ్రామస్తులు తొలగించారు. తిరిగి బుధవారం మోత్కూర్ గ్రామస్తులు తూమును పూడ్చివేయడంతో కాల్వ వద్ద మామిడాల, మోత్కూర్ గ్రామ రైతులు మధ్య గొడవ జరిగింది. మోత్కూర్ చెరువులో నీరు లేనందున అధికారులకు సమాచారం ఇచ్చి తూమును కట్టినట్లు మోత్కూర్ రైతులు తెలిపారు. అయితే మామిడాల, యాపలగూడంకు కూడా సమానంగా నీటిని విడుదల చేయాలని రైతులు వారిని అడ్డుకున్నారు. ఐబీ అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులను నచ్చజెప్పారు.

బడ్జెట్ ప్రతులు దహనం

నకిరేకల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలకు కాకుండా పెత్తందార్లకు లబ్ధి చేకూరేలా ఉందని ఆరోపిస్తూ నకిరేకల్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక నిధులు కేటాయించలేదన్నారు. ఉపాధి హామీకి నిధులు తగ్గించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, నాయకులు గింజల లక్ష్మీ, పాలడుగు పరమేష్, గురుజ స్వరూప, ఆదిమల్ల శంకర్, వంటిపాక జమదగ్ని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి



నకిరేకల్ : ర్యాలీని ప్రారంభిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నార్కట్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

నల్లగొండ టూటౌన్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బుధవారం నల్లగొండలోని శివాజీనగర్ సెంటర్‌లో గల శివాజీ విగ్రహానికి రాష్ట్రీయ శ్రీరాం సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు జల్లెల గోవర్ధన్‌యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొత్త లింగస్వామి, యోగ శివ, స్వామి, గణేశ్, ప్రశాంత్, నవీన్, రాజు పాల్గొన్నారు.

రామగిరి(నల్లగొండ): ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని హిందూ వాహిని ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ పట్టణంలో నిర్వహించిన భారీ ర్యాలీని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి ప్రారంభించారు. రామగిరి రామాలయం నుంచి క్లాక్ టవర్ మీదుగా పట్టణంలో ర్యాలీ కొనసాగింది. యువత భారీ సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు.

కోలాహలంగా శోభాయాత్ర

నకిరేకల్ : ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నకిరేకల్ పట్టణంలో హిందూ జనశక్తి, విశ్వ హిందూ పరిషత్, మాతృశక్తి టీం, హిందు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన శివాజీ మహారాజ్ శోభాయాత్ర కోలాహలంగా సాగింది. స్థానిక కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే వేముల వీరేశం, హిందూ జనశక్తి రాష్ట్ర అధ్యక్షుడు లలిత్‌కుమార్ పూజలు చేసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో హిందూ జనవాహిణితో కలిసి పాల్గొన్నారు. భారీ డీజే సౌండ్ మధ్య జై ఛత్రపతి శివాజీ అంటూ యువత నినదిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, మాతా శక్తి టీం ప్రతినిధులు సత్యవతి, పందాల వసంత, సుమలత, రేణుక, వివిధ సంఘాల, పార్టీల ప్రతినిధులు లలిత్‌కుమార్, బ్రహ్మదేవర రవిశంకర్, ఉయ్యాల శ్రీనివాస్, గర్రె మురళి, యానల శంకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా నకిరేకల్ పట్టణంలో నవ్య చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో తలసేమియా పిల్లల కోసం బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 50 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పులగిల్ల అభిరాం, ధీరజ్, సింగం ముకేష్, మాదగోని రవీందర్, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



నల్లగొండ టూటౌన్: శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్రీయ శ్రీరామ్ సేన నాయకులు

నార్కట్‌పల్లి : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను నార్కట్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం హిందూవాహిని ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని మునుగోడు చౌరస్తా నుంచి అమ్మనబోలు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం నల్లగొండ చౌరస్తాలో శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హిందూ వాహిని జిల్లా ఉపాధ్యక్షుడు గండికోట రాజు, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు పజ్జూరు వెంకట్‌రెడ్డి, మెడబోయిన శ్రీనివాస్, పుల్లెంల మహేష్, నోముల నాగరాజు, పాలకూరి రమేష్, గణేశ్, రామలింగం, శివ, అంజి, రాజు, రాజేష్, నరేష్, ప్రవీణ్, శ్రవణ్, సందీప్, వెంకట్ తదితరులు ఉన్నారు.

చిట్యాల: ఛత్రపతి శివాజీ జయంతిని చిట్యాల పట్టణంతోపాటు, ఆరెగూడెం, గుండ్రాంపల్లి గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో గ్యార శేఖర్, నాగంపల్లి శ్యాంసుందర్, బూతాల భిక్షపతి, సిందే ఆంజనేయులు, మురాల రామలింగస్వామి, నాగంపల్లి కిశోర్‌కుమార్, మురాల తిరుమలేష్, లడే రాములు, వినయ్, కూరెళ్ల లింగస్వామి, జిట్ట స్వామి, పోకల రాములు, కూరెళ్ల శ్రీను, మహేశ్వరి, పిల్లి కవిత పాల్గొన్నారు.



చిట్యాల: ఆరెగూడెంలో శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



గట్టుప్పల్‌లో ..

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆరే క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కొడగాని సత్తయ్య, లడే యాదయ్య, ఇంగిలి యాదయ్య, కొడగాని శేఖర్, ఇంగిలి నరేష్, ప్రవీణ్, భిక్షమయ్య, శ్రీకాంత్, శివాజీ, మల్లేష్, సురేష్ పాల్గొన్నారు.

మర్రిగూడ : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను బుధవారం మర్రిగూడ మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో సామాజిక కార్యకర్త వల్లంల సంతోష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేరడ గ్రామంలో మదర్సా మూసివేత

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామంలో నిర్వహిస్తున్న మదర్సాపై వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకుని మంగళవారం ఖాళీ చేయించినట్లు చిట్యాల తహసీల్దార్ కృష్ణనాయక్ బుధవారం తెలిపారు. నేరడ గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో గల భవనంలో ఎలాంటి అనుమతులు లేకుండా 'దార్ యూల్ ఉలూమ్–నేరడ' పేరుతో మదర్సాను నాలుగేళ్లుగా నిర్వహిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన పలువురు జనవరి 20న కలెక్టర్ ఇలా త్రిపాఠికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో చిట్యాల తహసీల్దార్ కృష్ణనాయక్, ఎస్ఐ ధర్మా అదేరోజు నేరడ గ్రామంలో నిర్వహిస్తున్న మదర్సాను పరిశీలించారు. ఆ సమయంలో అస్సాం, పశ్చిమబెంగాల్‌కు చెందిన సుమారు 21 మందికి పైగా ఆరేళ్ల నుంచి పదహారేళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు ఎలాంటి గుర్తింపు కార్డులు లేకుండడంతోపాటు వారికి అస్సాంకు చెందిన వ్యక్తి బోధన చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతే కాకుండా మదర్సాకు ఎలాంటి అనుమతులు లేవని గుర్తించిన అధికారులు ఉన్నధికారులకు నివేదిక అందజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నేరడ గ్రామంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మదర్సాను మంగళవారం నిర్వాహకులు ఖాళీ చేశారు.

నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం: నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నర్సరీల్లో నాటిన విత్తనాలు వంద శాతం మొలకెత్తేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొలకెత్తిన మొక్కలను సంరక్షించేందుకు షేడ్‌నెట్‌లను ఏర్పాటు చేయాలన్నారు. మార్చి చివరి నాటికి లేబర్ బడ్జెట్ పూర్తి చేయాలని, వేసవి సమీపిస్తున్నందున మొక్కలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పన్నుల వసూలులో లక్ష్యాన్ని అధిగమించాలని కార్యదర్శులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీఓ పద్మ, ఏపీఓ జంగమ్మ, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

చిట్యాల: మండలంలోని చిన్నకాపర్తి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కట్టెల లింగస్వామి కాలును ఇటీవల ఆపరేషన్ చేసి తొలగించారు. కాగా లింగస్వామిని కాంగ్రెస్ పార్టీ నాయకుడు కంచర్ల వెంకట్‌రెడ్డి బుధవారం పరామర్శించి వైద్య ఖర్చులకుగాను రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా గ్రామానికి చెందిన రూపని వెంకన్న ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి వెంకట్‌రెడ్డి రూ.ఐదు వేలు అందజేశారు.

మంత్రికి ఘన స్వాగతం

నకిరేకల్ : దురాజ్‌పలి పెద్దగట్టు శ్రీ లింగమంతుల స్వామి జాతరకు వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బుధవారం నకిరేకల్‌లోని పద్మనగర్ జంక్షన్ వద్ద కొద్దిసేపు ఆగారు. మంత్రికి స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆలేరు, మిర్యాలగూడెం ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య, మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజిత ఉన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు వీరేశం, ఐలయ్య, లక్ష్మారెడ్డి